

మంత్రి డి.అనసూయకు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం, తదితరులు

అన్నాబావు సాటే జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

పంజాగుట్ట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాంగ్ సమాజ్ ప్రజల ఆరాధ్యుడు సామ్రాట్ అన్నాబావు సాటే జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ప్రజాభవన్‌లో రాష్ట్ర మంత్రి డి.అనసూయ(సీతక్క)ను అన్నాబావు సాటే అసోసియేషన్ నాయకులు డీకే.నాందేవ్ మాంగ్, సమితి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు లక్షలకు పైగా మాంగ్ సమాజ్ ప్రజలు ఉన్నారని, బడుగు బలహీన వర్గాలను చైతన్యం చేయడం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు అన్నాబావుసాటే అని అన్నారు. ఆయన జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే మహారాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా పెద్దఎత్తున ఆయన జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని మన రాష్ట్రంలో కూడా నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జివలే మాధవ్, సాంబశివరావు, సచిన్ సాగురే, తల్వారే పరమేశ్వర్, కైలాష్, తదితరులు ఉన్నారు.

విజయలక్ష్మి దేవాలయంలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

ఎర్రగడ్డ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని శ్రీవిజయలక్ష్మి దేవాలయంలో గురువారం నుంచి శ్రీ శ్రీనివాస సమేత శ్రీవిజయలక్ష్మి అమ్మవారి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయని దేవాలయ కమిటీ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ పవిత్రోత్సవాలు ఈ నెల 21 వరకు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలను శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మంగళ శాసనములతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



సెయిలింగ్‌లో అష్రఫ్, అఖిలకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ మాన్‌సూన్ రెగెట్టా పోటీల్లో హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్, కొప్పుల అఖిల స్వర్ణ పతకాలు సాధించారు. బుధవారం హుస్సేన్ సాగర్‌లో జరిగిన ఈ పోటీల్లో అష్రఫ్ స్వర్ణం నెగ్గగా, నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన యువరాజ్ రజతం, ఉద్భవ్ స్కూల్‌కు చెందిన పార్థు కాంస్యం గెలిచారు. బాలికల హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో అఖిల స్వర్ణం సాధించగా, ముషీరాబాద్‌కు చెందిన నిఖిత రజతంతో మెరిసింది.

గిరిజన చట్టాలను అమలు చేయాలి

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గిరిజన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకొన్నారు. రంగారెడ్డి జిల్లా తెలంగాణ గిరిజన సమాఖ్య అధ్యక్షుడిగా ఏ రాజూ నాయక్, ప్రధాన కార్యదర్శిగా జర్పుల శివనాయక్(ప్రచండ) ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జి.శంకర్‌నాయక్, సహాయకార్యదర్శిగా బి.భిక్షునాయక్, కోశాధికారిగా చత్రునాయక్, కార్యవర్గం, కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం అంజయ్య నాయక్ మాట్లాడుతూ దేశంలో గిరిజన చట్టాలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఆరోపించారు. దాంతో దేశవ్యాప్తంగా గిరిజనులపై దాడులు జరుగుతున్నాయన్నారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధికి కావాల్సిన చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, హరిసింగ్ నాయక్, ఎ.రాజు నాయక్ పాల్గొన్నారు.

రూ.3.06 కోట్లకు కిలాడీ లేడీ టోకరా

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు.. మహిళ అరెస్టు

హైదరాబాద్‌సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని మోసం చేసి అతడి నుంచి రూ. 3.06 కోట్లు కాజేసిన కిలాడీ లేడీని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్టు చేశారు. శేరిలింగంపల్లి, నల్లగండ్ల ప్రాంతానికి చెందిన పానుగంటి ఇందిరాదేవి రెడ్డి (29) అలియాస్ ఇందిరాదేవి కొన్నేళ్లుగా మోసాల బాట పట్టింది. ఓ ఎన్నారైగా బిల్డప్ ఇస్తూ.. బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసింది. నాగోల్‌లో దేవి ఫుడ్స్ పేరిట ఓ ఫుడ్ ఇండస్ట్రీ కూడా ఉందని అమాయకులను నమ్మించింది. నార్సింగి, మాదాపూర్, గచ్చిబౌలిలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీల్లో తనకు ఎన్నో విల్లాలు, ఆస్తులున్నాయని, నాగోల్‌లో ఓ అపార్టుమెంట్ కూడా ఉందని అమాయకులను బురిడీ కొట్టించింది. మదీనాగూడకు చెందిన ఎస్. సత్యనారాయణతో పరిచయం పెంచుకున్న ఆమె తన వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించింది. సత్యనారాయణ రూ. 3.06కోట్ల పెట్టుబడి పెట్టాడు. బాధితుడికి సంబంధించిన రెండు కార్లను కూడా తీసుకెళ్లి తనఖా పెట్టింది. ఇద్దరు స్నేహితులను తీసుకొచ్చి పోలీసు అధికారులుగా పరిచయం చేసి వారికి రెండు ఐఫోన్‌లు, వన్‌ప్లస్ ఫోన్‌లు సత్యనారాయణతో కొనుగోలు చేయించి తీసుకుంది. మోసపోయానని గ్రహించిన బాధితుడు డబ్బు, కార్లు తిరిగి ఇవ్వమని ఆమెను అడిగాడు. డబ్బు విషయం మరిచిపోవాలని, అడిగితే తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బ్లాక్‌మెయిల్ చేయసాగింది. బాధితుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి రెండు కార్లు, 3 ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.5.73 లక్షలకు బురిడీ

హైదరాబాద్‌సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ అమాయకుల నుంచి రూ. లక్షల్లో కొల్లగొడుతున్న సైబర్ నేరగాడి ఆటకట్టించారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బిండె పవన్ కల్యాణ్‌ను అరెస్టు చేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన జగదీశ్ ఉద్యోగం కోసం వెతుకుతున్న క్రమంలో ఒక లోకల్ యాప్‌లో కన్సల్టెన్సీ మేనేజర్ పేరుతో ఒక ప్రకటన కనిపించింది. దాంతో బాధితుడు అందులోని నంబర్‌కు సంప్రదించాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. మా వద్ద ఎంఎన్‌సీ కంపెనీల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఉద్యోగం ఖాళీగా ఉందని, అయితే, బ్యాక్‌డోర్ ఉద్యోగాలు కావడంతో కొంత డబ్బు ఖర్చు అవుతుందని చెప్పాడు. ముందుగా రూ. 2వేలు డిపాజిట్ చేయించుకున్నాడు. ఆ తర్వాత వివిధ రకాల ఫీజుల పేరుతో బాధితుడిని మభ్యపెట్టి దశల వారీగా రూ. 5.73లక్షలు కొల్లగొట్టాడు. ఆ తర్వాత స్పందించడం మానేశాడు. అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతిక ఆధారంగా నిందితుడు ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బిండె పవన్ కల్యాణ్‌గా గుర్తించి అరెస్టు చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో లోకల్ యాప్‌లో క్యూటీఆర్ కంపెనీకి జాబ్ కన్సల్టెన్సీ మేనేజర్‌గా చెప్పుకుంటూ.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఆన్‌లైన్‌లోనే మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు



శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల రద్దీ



ఫిలింనగర్ దైవసన్నిధానంలో ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలిపండుగ కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలో అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజాదికాలు చేశారు. ఆలయ నిర్వాహకులు మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, పరుచూరి గోపాలకృష్ణ ఏర్పాట్లను సమీక్షించారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రగడ్డ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఎర్రగడ్డలోని శ్రీవిజయలక్ష్మి దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, దేవాలయ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ప్రధానకార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎంపీ.రెడ్డి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగడ్డ శ్రీవిజయలక్ష్మి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఖైరతాబాద్‌లో మొక్కలు నాటిన దానం

ఖైరతాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం పేరిట ఖైరతాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ మొక్కలు నాటారు. ఖైరతాబాద్ ఉద్యానవనంతో పాటు స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆయన స్థానికులు, వైద్య సిబ్బందితో కలిసి పలు మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని, పట్టణాల్లో టెర్రస్, కిచెన్, బాల్కనీ గార్డెన్‌లను ఏర్పాటుచేసుకొని పూలు, కూరగాయలను పండించుకోవచ్చు అని అన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణి మాట్లాడుతూ.. ఆస్పత్రి నుంచి వెల్‌నెస్ సెంటర్‌ను తరలిస్తే మరిన్ని సేవలందిస్తామని, వెనక వైపున మరో గేటును ఏర్పాటుచేయాలని, ఆస్పత్రిలో సీసీ కెమారాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే దానం స్పందించి తన నిధులతో పనులుచేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, అశోక్, మహేందర్‌బాబు, మహేష్ యాదవ్, ప్రవీణ్, రాజు, శ్యాం పాల్గొన్నారు.



ఖైరతాబాద్ ఏరియా ఆస్పత్రిలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం



చిల్లాగౌస్-ఇ- పాక్ మొహరం పీర్ నంద్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో పీర్ల ఊరేగింపు



ఎల్లారెడ్డిగూడలో షర్బత్‌ను పంపిణీ చేస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు కూడళ్లలోని చిల్లాల వద్ద పీర్లను ఊరేగించి దట్టీలను సమర్పించారు. ఎల్లారెడ్డిగూడలో జరిగిన ఊరేగింపునకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హాజరై షర్బత్‌ను పంపిణీ చేశారు. మొహర్రం పండుగ సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని నందినగర్‌లో ఛిల్లా గౌస్-ఇ-పాక్ మొహర్రం పీర్ నంద్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో పీర్ల పండుగ వేడుకలు, ఊరేగింపు వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఖాజా బందేనవాజ్, అల్లా మొహ్మద్, ఇమామ్ హుస్సేన్ పీర్లకును ముస్తాబు చేసి దట్టీలు కట్టి, కుడుక బెల్లం, వెండి పంజాలు కట్టి ఘనంగా ఊరేగించారు. నందినగర్ నుంచి ఎల్లారెడ్డిగూడ వరకు ఈ పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అసోసియేషన్ అధ్యక్షుడు రామ్‌దాస్‌చౌహాన్, ఉపాధ్యక్షులు మహ్మద్‌అహ్మద్, వి.రాములు, మహ్మద్ సలీం, సెక్రటరీచౌహాన్ శంకర్, సంయుక్త కార్యదర్శి ఫరీద్ షరీఫ్, జోగ్యా, పి.కిషన్, షహబుద్దీన్, రూపాల్‌నాయక్, దశరథ్, ప్రసాద్ యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మొహర్రం పర్వదినం సందర్భంగా పలు ప్రాంతాల్లో ఆలంల ఊరేగింపులు పెద్ద ఎత్తున జరిగాయి. ఖైరతాబాద్, సోమాజిగుడ, చింతలబస్తీ, ఏసీగార్డ్స్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆలంల ఊరేగింపులు రావడంతో ఖైరతాబాద్ గ్రంథాలయ చౌరస్తాలోని దర్గా వద్ద సందడి వాతావరణం కనిపించింది. వందలాది మంది ఈ దర్గాలో పాత్యాల్‌తోపాటు దట్టీలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కాగా ఖైరతాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన ఆలం(పీర్లు) వద్ద కార్పొరేటర్ విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎస్‌కే షరీఫ్, మైనారిటీ నేత షేక్‌సలీం తదితరులు ప్రార్థనలు చేశారు.



ఖైరతాబాద్‌లో ఆలంల వద్ద కార్పొరేటర్ విజయారెడ్డి, నాయకులు



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న స్థానికులు

పీఆర్‌సీ నివేదిక ప్రకటించాలి

కవాడిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ నివేదిక ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం దోమలగూడలో టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కర్ణాటక ప్రభుత్వం 27.5 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించిందని, రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్ లోన్లు, పదవీ విరమణ అనంతరం చెల్లించాల్సిన బిల్లులు రెండేళ్లుగా చెల్లించకపోవడం దారుణమని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి మాట్లాడుతూ.. బదిలీలలో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చినప్పుడు జరిగిన పొరపాట్ల వల్ల దూర ప్రాంతానికి వెళ్లిన వారికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ ఉపాధ్యక్షులు సీహెచ్ రాములు, సీహెచ్ దుర్గాభవానీ, రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, నాయకులు పి. మాణిక్‌రెడ్డి, ఎ. వెంకట, ఎ. సోమశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

ట్యాంక్‌బండ్‌పై ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు కృషి

- బెల్లయ్య నాయక్

కవాడిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎరుకల జాతి మూల పురుషుడు ఏకలవ్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణ గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ అన్నారు. ఏకలవ్య జయంతిని పురస్కరించుకొని ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన కార్యక్రమంలో బెల్లయ్య నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు తదితరులు ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ.. ఎరుకల కులస్థుల సమస్యలు, ఆదివాసీ ఎరుకల విద్యార్థుల కోసం నగరంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ.. పందుల పెంపకానికి ప్రభుత్వ భూమి కేటాయించాలని, నిజాంపేటలో ఎరుకల ఆత్మగౌరవ భవనాన్ని వెంటనే పూర్తిచేయాలని, ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ. 500 కోట్ల బడ్జెట్ కేటాయించి, చైర్మన్‌గా ఎరుకల సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సదానందం, కోనేటి నరసింహ, రవికుమార్, వనం రమేష్, ఆనంద్, కూతాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏకలవ్య జయంతి కార్యక్రమంలో బెల్లయ్యనాయక్, ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు తదితరులు



తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బొర్రా జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఖైరతాబాద్ ముదిరాజ్ సంఘం నాయకులు రాజశేఖర్, రాకేష్ ముదిరాజ్‌లు - ఖైరతాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి)



బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టర్నోవర్‌ను రూ.600 కోట్లకు తీసుకెళ్లాలి

రాంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కళా నైపుణ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, ఆ వృత్తులను ప్రోత్సహిస్తూ మార్కెటింగ్ సౌకర్యానికి వేదికగా పనిచేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని హస్తకళాభవన్‌లో హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా సత్యనారాయణగౌడ్ బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, లేపాక్షి ఎండీ శైలజా రామయ్యర్ పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంస్థ టర్నోవర్‌ను రూ.600 కోట్లకు తీసుకెళ్లాలని సూచించారు. చేనేత వృత్తులను ప్రోత్సహించడానికి చేనేత వస్త్రాలను ప్రభుత్వం తరపున వివిధ సంస్థలకు ఇవ్వడానికి జీవో నంబర్ 1 ద్వారా టెస్కో కొనుగోలు చేస్తుందన్నారు. హస్తకళలకు సంబంధించిన వాటిని ఈ కార్పొరేషన్ నుంచి తయారు చేసినవి మాత్రమే కొనుగోలు చేసేలా జీవో తీసుకురావడానికి ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. చేతి వృత్తులు, చేనేత కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. సంస్థ మరింత ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థల సమస్యల పరిష్కారం కోసం త్వరలో సమావేశం : మంత్రి పొన్నం

చిక్కడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సంస్థల సమస్యల పరిష్కారం కోసం సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తానని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ వార్షిక వేడుకలు బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొన్నం మాట్లాడుతూ.. కళాకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా సొసైటీ తరఫున వినతిపత్రాన్ని గాయని ఆమనితో కలిసి వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మంత్రికి అందజేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, రసమయి రాము, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత

కారంచేడు బాధితుల పోరాటం స్ఫూర్తిదాయకం : వక్తలు

రాంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కారంచేడు సంఘటనపై సుదీర్ఘ పోరాటంతో సుప్రీం కోర్టు నిందితులకు శిక్ష విధించిందని, ఇది బాధితులు సాధించిన విజయమని పలువురు వక్తలు అన్నారు. కారంచేడు బాధితుల పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కులనిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) ఆధ్వర్యంలో కారంచేడు దళిత మృతవీరుల సంస్మరణ సభ జరిగింది. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, హైకోర్టు న్యాయవాది బత్తుల కార్తీక్ నవయాన్, సమతా సైనిక్ దళ్ దక్షిణ భారత రాష్ట్రాల అధ్యక్షుడు రెంజర్ల రాజేష్, ప్రజాకళామండలి రాష్ట్ర అధ్యక్షుడు జాన్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జయరాజు, ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్ తదితరులు మాట్లాడారు. దళిత మృతవీరులను స్మరించుకుంటూ ఈ నెల 17 (కారం చేడు) నుంచి ఆగస్టు 6 (చుండూరు) వరకు వాడవాడలా దళిత మృతవీరుల సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కరుమల్‌యన్

హయ్యర్ పెన్షన్‌కు అందరూ అర్హులే

- సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమల్‌యన్

రాంనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పును పరిశీలిస్తే హయ్యర్ పెన్షన్‌కు అందరూ అర్హులేనని సీఐటీయూ జాతీయ కార్యదర్శి, పీఎఫ్ బోర్డు సభ్యుడు ఆర్. కరుమల్‌యన్ అన్నారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో టీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్, ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్, వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు తీర్పు అమలు - హయ్యర్ పెన్షన్ సమస్యలపై రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పీఎఫ్ ట్రస్టులో రూ.25 లక్షల కోట్లు జమ అయిందని, ఇది దక్షిణ భారత దేశ రాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువ అని అన్నారు. రూ.500 కోట్లను స్టాక్‌షేర్ మార్కెట్‌లో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. 11 కోట్ల మంది పెన్షన్ సభ్యులు ఉన్నారని, వేతన సవరణ అనంతరం పెన్షన్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు వీరాంజనేయులు, ఏపీఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు జిలానీ పాషా, ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫాక్స్‌సాగర్ చెరువు సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. 35 నుంచి 40 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఫాక్స్‌సాగర్ చెరువు సమీపంలో ఉరివేసుకుని ఉండడంతో స్థానికులు. పేట్‌బషీరాబా ద్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



ప్రత్యేక అలంకరణలో మధురానగర్‌కాలనీ బంగారు మైసమ్మ అమ్మవారు

సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజక వర్గాలలోని పలు ఆలయాల్లో బుధవారం తొలి ఏకాదశి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సికింద్రాబాద్‌లోని గణపతి ఆలయంలో గణేషుడికి విశేష అలంకరణ చేశారు. శ్రీనివాస్‌నగర్‌కాలనీ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరుమలగిరి, బొల్లారంలోని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సదర్‌బజార్‌లోని శ్రీ మహంకాళి దేవాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లలో, శ్రీనివాసనగర్ కాలనీలో అత్యంత వైభవంగా ఏకాదశి వేడుకలు జరిగాయి. రెజిమెంటల్‌బజార్‌లో ఉన్న పాండురంగ ఆలయంలో బుధవారం బ్రాహ్మీముహుర్తంలో అభిషేకము, శ్రీవిష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణము, సాయంత్రం దివ్యరథోత్సవం నిర్వహించారు.

- సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ జోన్ బృందం



సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా విశేష అలంకరణలో గణేషుడు

-రెజిమెంటల్‌బజార్, ఆంధ్రజ్యోతి

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

● ఓయూ జేఏసీ విద్యార్థి నాయకుల విజ్ఞప్తి



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి తదితరులు

తార్నాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరుతూ ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, త్వరలోనే విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు పులిగంటి వేణుగోపాల్, శివశంకర్, పులిగంటి సురేష్, రవీందర్, రాజేందర్, కుమార్, శ్రీనివాస్, ప్రసాద్, సంతోష్, మహేష్, రాము పాల్గొన్నారు.



సాయిబాబా హట్స్‌వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

తిరుమలగిరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి సాయిబాబా హట్స్‌కు చెందిన మహిళలు తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని మహిళలు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇళ్ల పట్టాలు పేదవర్గాలకు మంజూరు చేస్తానని చెప్పారని ఎమ్మెల్యే శ్రీగణేష్ వారికి వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రజాపాలనలో ప్రభుత్వంతో మాట్లాడి ఇళ్లు మంజూరు చేయడానికి కృషిచేస్తానని వారికి చెప్పారు. మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శ్రీను, చిన్నరాయుడు, సురేష్, బాబు, నాగయ్య చెన్నమ్మ, మంగమ్మ, జానకమ్మ, నాగేశ్వరమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల రహదారి కోసం నిరసన

చిలకలగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలకి సరైన దారి ఏర్పాటు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మైలార్‌గడ్డ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సరైన దారి లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 15రోజుల క్రితం ప్రజావాణిలో కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తెలుగుతో పాటు ఉర్దూ మీడియం కూడా పాఠశాలలో వుందని అంగన్ వాడి కేంద్రం కూడా వుందని, రాకపోకలకి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆటోలు వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమస్యల కేంద్రాలుగా మారాయని, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు చక్కదిద్దటానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోమురెల్లి బాబు, సోమయ్య, సువర్ణ, ప్రవీణ్, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్ గుంటి కృష్ణను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బీ.ఎన్.రమేష్‌కుమార్ మాదిగ

కట్టమైసమ్మ ఆలయ చైర్మన్ గుంటి కృష్ణకు సత్కారం

బౌద్ధనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయ చైర్మన్‌గా నియమితులైన గుంటికృష్ణను బుధవారం మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు బీ.ఎన్.రమేష్‌కుమార్ మాదిగ సత్కరించారు. ఆలయంలో గుంటికృష్ణకు పూలదండలు వేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంద్రు నరసింహ మాదిగ, వెంకటేశ్, లాజర్‌తో పాటు సభ్యులు జగన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, కె.బి.ధరమ్‌వీర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల కులగణనకు కమిటీని వేసి విధివిధానాలను రూపొందించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్

తార్నాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల కులగణనకు సంబంధించిన కమిటీని వెంటనే వేసి విధివిధానాలను రూపొందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈమేరకు బుధవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే బీసీల కులగణన చేపడుతామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా దానికిసంబంధించిన విధివిధానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బీసీల కులగణన ప్రకియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

సెయిలింగ్‌లో అష్రఫ్, అఖిలకు స్వర్ణాలు



సెయిలర్ అష్రఫ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ మాన్‌సూన్ రెగెట్టా పోటీల్లో హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్, కొప్పుల అఖిల స్వర్ణ పతకాలు సాధించారు. బుధవారం హుస్సేన్ సాగర్‌లో జరిగిన ఈ పోటీల్లో అష్రఫ్ స్వర్ణం నెగ్గగా, నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన యువరాజ్ రజతం, ఉద్భవ్ స్కూల్‌కు చెందిన పార్థు కాంస్యం గెలిచారు. బాలికల హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో అఖిల స్వర్ణం సాధించగా, ముషీరాబాద్‌కు చెందిన నిఖిత రజతంతో మెరిసింది.



ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు రెడ్డి శ్రీను బుధవారం విద్యార్థి నాయకులతో కలిసి ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ విద్యార్థి నాయకులు రమేష్ ముదిరాజ్, జగన్ తదితరులు పాల్గొన్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి

భక్తులతో కిటకిటలాడిన ఉజ్జయినీ మహాకాళి ఆలయం



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారు



భక్తజనంతో కిటకిటలాడిన మహాకాళి ఆలయం

సికింద్రాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగ కారణంగా సెలవు రావడం, తొలి ఏకాదశి పర్వదినం కావడం, ఆషాఢ బోనాల జాతర సమీపిస్తుండడంతో బుధవారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. సికింద్రాబాద్‌తోపాటు జంటనగరాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలిరావడంతో బోనాల పండుగ ముందే వచ్చేసినట్టుగా ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక చింతనతో శోభిల్లాయి. తొలిఏకాదశి పర్వదినం కావడంతో సికింద్రాబాద్‌లోని వివిధ ఆలయాలను దర్శించుకున్న భక్తులు.... సమీపంలోని ఉజ్జయినీ మహాకాళి ఆలయానికి కూడా తరలివచ్చారు. అమ్మవారికి పూజలు చేశారు. భక్తుల సంఖ్య పెరగడంతో మహంకాళి పోలీసులు రంగంలోకి దిగి క్యూలైన్లలో పంపించవలసి వచ్చింది.

అధిక లాభాల ఆశ చూపి వ్యక్తికి టోకరా

● రూ. 3.06 కోట్లు దండుకున్న కిలాడీ లేడి

● పోలీసులను ఆశ్రయించిన బాధితుడు.. మహిళ అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని మోసం చేసి అతడి నుంచి రూ.3.06 కోట్లు కాజేసిన కిలాడీ లేడీని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం అధికారులు అరెస్టు చేశారు.

శేరిలింగంపల్లి, నల్లగండ్ల ప్రాంతానికి చెందిన పానుగంటి ఇందిరాదేవి రెడ్డి (29) అలియాస్ ఇందిరాదేవి కొన్నేళ్లుగా మోసాల బాట పట్టింది. ఓ ఎన్నారైగా బిల్డప్ ఇస్తూ.. బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేసింది. నాగోల్‌లో దేవి ఫుడ్స్ పేరిట ఓ ఫుడ్ ఇండస్ట్రీ కూడా ఉందని అమాయకులను నమ్మించింది. నార్సింగి, మాదాపూర్, గచ్చిబౌలిలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీల్లో తనకు ఎన్నో విల్లాలు, ఆస్తులున్నాయని, నాగోల్‌లో ఓ అపార్టుమెంట్ కూడా ఉందని అమాయకులను బురిడీ కొట్టించింది.

మదీనాగూడకు చెందిన ఎస్.సత్యనారాయణతో పరిచయం పెంచుకున్న ఆమె తన వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని నమ్మించింది. సత్యనారాయణ రూ. 3.06కోట్లు పెట్టుబడి పెట్టాడు. బాధితుడికి సంబంధించిన రెండు కార్లను కూడా తీసుకెళ్లి తనఖా పెట్టింది.

ఇద్దరు స్నేహితులను తీసుకొచ్చి పోలీసు అధికారులుగా పరిచయం చేసి వారికి రెండు ఐఫోన్‌లు, వన్‌ప్లస్ ఫోన్‌లు సత్యనారాయణతో కొనుగోలు చేయించి తీసుకుంది. మోసపోయానని గ్రహించిన బాధితుడు డబ్బు, కార్లు తిరిగి ఇవ్వమని ఆమెను అడిగాడు. డబ్బు విషయం మరిచిపోవాలని, అడిగితే తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బ్లాక్‌మెయిల్ చేయసాగింది. బాధితుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహిళను అరెస్టు చేసి ఆమె నుంచి రెండు కార్లు, 3ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

బోనాల పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

● డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాబోయే సికింద్రాబాద్ ఉజ్జయినీ ఆషాఢ బోనాల జాతర ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అందుకు తగిన బందోబస్తును ఏర్పాటు చేస్తున్న పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ కోరారు. బుధవారం మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పరశురామ్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో ఫలహారపు బండ్ల నిర్వాహకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... బోనాల పండుగ, జాతర సందర్భంగా లక్షలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారని, అలాంటి జాతరను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. జాతర పేరిట తాగి, డీజేలు ఏర్పాటు చేసుకొని, అసభ్య నృత్యాలతో ఇతర భక్తులకు ఇబ్బందులు కలుగచేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో అదనపు డీసీపీ పి.అశోక్, మహంకాళి ఏసీపీ సర్దార్‌సింగ్, ఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ నోముల వెంకటేశ్వర్లు, వివిధ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు నర్సింగరావు, రాఘవేందర్, శ్రీకాంత్, ఉమాశంకర్‌లతో పాటు స్వచ్ఛంద సంస్థల సేవకులు, వివిధ సంఘాల నాయకులు, ఫలహారపు బండ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

మహాకాళి అమ్మవారికి బోనాల ఊరేగింపునకు అనుమతించాలి

● గుర్రం పవన్‌కుమార్‌గౌడ్



పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్

సికింద్రాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతరను పురస్కరించుకుని ఉజ్జయినీ మహాకాళి అమ్మవారికి 100 మంది మహిళలు ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించేందుకు అనుమతించాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఉత్తర మండలం డీసీపీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం రెజిమెంటల్‌బజార్‌లోని పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన సతీసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం పవన్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. లష్కర్ జిల్లా సాధన కోసం తాము కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా అమ్మవారికి బోనాలు సమర్పించి, ఆశీస్సులు తీసుకోవాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. సిటీలైట్ హోటల్ నుంచి బాటా మీదుగా మహాకాళి ఆలయం వరకు బోనాలతో 100 మంది మహిళలు ఊరేగింపుగా వెళ్లేందుకు అనుమతించాలని డీసీపీకి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. ఊరేగింపులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

నిఘా పెంచిన రక్షణ దళం..

లక్షలాది సొత్తు స్వాధీనం ..!

● జూన్‌లో రైల్వే పోలీసుల పనితీరు భేష్ దక్షిణమధ్య రైల్వే

హైదరాబాద్, జులై 17 (ఆంధ్రజ్యోతి): రైల్వే రక్షణదళం (ఆర్‌పీఎఫ్) అద్భుత పనితీరుతో జూన్ మాసంలో ప్రయాణికులకు మెరుగైన భద్రత కల్పించడంతో పాటు నిఘాపెంచి, లక్షలాది విలువైన దొంగసొత్తును స్వాధీనం చేసుకుని యజమానులకు అప్పగించినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ఆస్తుల రక్షణతోపాటు ప్రయాణికుల భద్రతపై రక్షణదళం ప్రత్యేక దృష్టి సారించినట్టు పేర్కొన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ యాత్రి సురక్ష ద్వారా నమోదైన 45 కేసుల్లో 38 మంది నేరస్తులను అరెస్టు చేసి రూ.20.63లక్షల విలువైన సొత్తును రైల్వే పోలీసులు స్వాధీనంచేసుకున్నట్టు అధికారులు వివరించారు. రైళ్లలో జూన్ మాసంలో 193 మంది ప్రయాణీకులు పోగొట్టుకున్న దాదాపు 50లక్షల పైగా విలువైన వస్తువులను ఆపరేషన్ అమానత్ ద్వారా పోలీసులు కాపాడి యజమానులకు అప్పగించడానికి సాయం అందించినట్టు తెలిపారు. 'ఆపరేషన్ నార్కోస్ ద్వారా రైల్వే పోలీసులు రైళ్లలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేచర్యల్లో భాగంగా 12మందిని అరెస్టు చేసి రూ.71లక్షల విలువైన గంజాయిని జప్తు చేసుకున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

వివిధ కారణాలతో తప్పిపోయిన, పారిపోయిన వంద మంది పిల్లలను ఆపరేషన్ నాన్ హే ఫారిస్తే కింద గుర్తించి వారి వారి తలిదండ్రులకు అప్పగించినట్టు వివరించారు. వంద మంది పిల్లల్లో 86 మంది బాలురు కాగా, 14మంది బాలికలున్నట్టు అధికారులు తెలిపారు. మానవ అక్రమ రవాణాను నియంత్రించే లక్ష్యంతో రైల్వేల్లో చేపట్టిన ఆపరేషన్ ఆహ్ట్ ద్వారా 18 మంది మానవ అక్రమ రవాణాదారుల బారి నుంచి 27 మంది బాలురను, మరో బాలికలను రైల్వే పోలీసులు రక్షించినట్టు అధికారులు వివరించారు. ఆపరేషన్ జీవన్‌రక్ష కింద జూన్‌లో మృత్యు బారి నుంచి ఒకరి ప్రాణాలను కాపాడినట్టు తెలిపారు. ఇక ఆపరేషన్ సటార్క్ కింద రైళ్లలో అక్రమంగా మద్యంతో ప్రయాణిస్తున్న ఇరువురిని అరెస్టు చేసి రూ.88.09లక్షల విలువైన మద్యంను స్వాధీనం చేసుకుని కేసును ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

నిందితులపై ఎక్సైజ్ శాఖ అధికారులు నాలుగు కేసులు నమోదు చేసినట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. రైల్వే టికెట్ల దళారులను నియంత్రించేందుకు ఉద్దేశించిన ఆపరేషన్ ఉపలబ్ద్ కింద 11కేసులు నమోదు చేసి, 12మంది దళారులను అరెస్టు చేసినట్టు తెలిపారు. రూ.1,29,340 విలువైన 51 లైవ్ టిక్కెట్‌లను దళారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్‌లో ముస్లిం సోదరులకు షర్బత్ పంపిణీ చేస్తున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్



చిలకలగూడలో నిర్వహించిన పీర్ల పండుగలో పాల్గొన్న భక్తులు

బౌద్ధనగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ముస్లింలకు పవిత్రమైన మొహర్రం పర్వదినాన్ని బుధవారం చిలకలగూడలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సర్వమత సమానత్వాన్ని ఆకాంక్షిస్తూ హిందూ, ముస్లింలు పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిలకలగూడ, మైలార్‌గడ్డ, వారాసిగూడ తదితర ప్రాంతాల్లో షర్బత్‌ను పంపిణీ చేశారు. చిలకలగూడకు చెందిన హఫీజ్, హనీమున్నీషా వంశస్తుల ఆధ్వర్యంలో చిలకలగూడ గాంధీబొమ్మ వేర్వేరుగా ఏర్పాటుచేసిన పీర్లను డప్పుల దరువులతో పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం వేకువజామున నిర్వహించిన హలావా (నిప్పుల మీద నడక) కార్యక్రమం ఆకట్టుకుంది. స్థానిక ముస్లింలతో పాటు పెద్దసంఖ్యలో హిందువులు పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌ల పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటుచేశారు.



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి బుధవారం నేరెళ్ల శారదను ఆమె కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

ఉద్యోగాల పేరుతో మోసం

● రూ.5.73 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

● నిందితుడి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ అమాయకుల నుంచి రూ. లక్షల్లో కొల్లగొడుతున్న సైబర్ నేరగాడి ఆటకట్టించారు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బిండె పవన్ కల్యాణ్‌ను అరెస్టు చేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం... నగరానికి చెందిన జగదీశ్ ఉద్యోగం కోసం వెతుకుతున్న క్రమంలో ఒక లోకల్ యాప్‌లో కన్సల్టెన్సీ మేనేజర్ పేరుతో ఒక ప్రకటన కనిపించింది. దాంతో బాధితుడు అందులోని నంబర్‌కు సంప్రదించాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. మా వద్ద ఎంఎన్‌సీ కంపెనీల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఉద్యోగం ఖాళీగా ఉందని, అయితే, బ్యాక్‌డోర్ ఉద్యోగాలు కావడంతో కొంత డబ్బు ఖర్చు అవుతుందని చెప్పాడు. ముందుగా రూ. 2వేలు డిపాజిట్ చేయించుకున్నాడు. ఆ తర్వాత వివిధ రకాల ఫీజుల పేరుతో బాధితుడిని మభ్యపెట్టి దశలవారీగా రూ. 5.73లక్షలు కొల్లగొట్టాడు. ఆ తర్వాత స్పందించడం మానేశాడు. అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సాంకేతిక ఆధారంగా నిందితుడు ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బిండె పవన్ కల్యాణ్‌గా గుర్తించి అరెస్టు చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో లోకల్ యాప్‌లో క్యూటీఆర్ కంపెనీకి జాబ్ కన్సల్టెన్సీ మేనేజర్‌గా చెప్పుకుంటూ.. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఆన్‌లైన్‌లోనే మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



సుధాకర్ (ఫైల్)

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవల కారణంగా భార్యపిల్లలకు దూరమై తాగుడికి బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమ్ముగూడ రైల్వే స్టేషన్ మార్గమధ్యంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన సుధాకర్ (44) ప్రవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ గొడవల కారణంగా భార్య, పిల్లలకు దూరంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసైన సుధాకర్ బుధవారం అమ్ముగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

కదులుతున్న రైలు ఎక్కబోయి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఓ వృద్ధుడు అక్కడికక్కడే మరణించిన ఘటన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబరు 3లో గుర్తుతెలియని 55ఏళ్ల వృద్ధుడు కాకతీయ రైలు కోసం ఎదురుచూస్తున్నాడు. ప్లాట్‌ఫాంపైకి రైలు రాగానే కదులుతున్న రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడి బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణ కల్యాణోత్సవం

పద్మారావునగర్, జులై, 17 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణిమ సందర్భంగా శ్రీ సాయి సప్తాహ ఉత్సవాలలో భాగంగా పద్మారావునగర్‌లోని సాయిబాబా ఆలయం లో మూడవ రోజు కార్యక్రమాలలో భాగంగా శ్రీ సిద్ధివినాయక సేవను నిర్వహించారు. భక్తులు విఘ్నేశ్వరున్ని దూర్వగడ్డితో పూజించారు. అనంతరం తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం సాయి ఆశ్రమంలో నెలకొని ఉన్న రావి, వేప వృక్షాలకు ప్రథమంగా ఆశ్రమ ఉత్తరాధికారి కీర్తిమామండపారాధన నవగ్రహ పూజను నిర్వహించగా, సద్గురు సాయినాథ్‌బాబా స్వయంగా లక్ష్మీనారాణ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ వాస్తుశాస్త్ర నిపుణులు దంతూరి పండరీనాథ్, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ కల్యాణోత్సవానికి హాజరై సాయిబాబాను దర్శించుకొన్నారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.